సాక్షి మహబూబ్‌నగర్

శనివారం । 8 । జూలై । 2023



పర్యవేక్షణ ఏది..?

ఉమ్మడి జిల్లాలో ఆహార కల్తీ నియంత్రణ అధికారుల కొరత తీవ్రంగా వేధిస్తోంది.

వివరాలు 8లో ▸



పాలమూరు భారీ విజయం

హెచ్‌సీఏ బీ–డివిజన్ టుడే లీగ్ మ్యాచ్‌లో పాలమూరు జట్టు విజయం సాధించింది.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
34.6 /22.1

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఇంటర్ సప్లిమెంటరీలో 59 శాతం ఉత్తీర్ణత

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా గత నెలలో జరిగిన ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. ఈ మేరకు జిల్లాలో 5,838 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవగా.. ఇందులో 3,434 మంది విద్యార్థులు పాసై 59 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. బాలురు 2,953 మంది పరీక్షలకు హాజరవగా.. 1,568 మంది పాసవగా.. బాలికలు 2,885 మంది పరీక్షలకు హాజరుకాగా 1,889 మంది పాసయ్యారు.

ఎస్సెస్సీలో 95 శాతం..

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా గత నెలలో జరిగిన ఎస్సెస్సీ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. ఈ మేరకు 3,606 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవగా.. 3,459 మంది పాసై 95 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. ఉత్తీర్ణులైన వారిలో బాలురు 2,008 మంది కాగా.. బాలికలు 1,451 మంది ఉన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశాలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ఏనుగొండ వద్ద ఉన్న కేంద్రీయ విద్యాలయంలో యూకేజీ (బాలవాటిక- 3) ప్రవేశాలు కల్పిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ దశరథరాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు 2023 మార్చి 1 నాటికి 5 నుంచి 6 ఏళ్లలోపు విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. ఆసక్తిగలవారు కేంద్రీయ విద్యాలయ వెబ్‌సైట్‌లో ఈ నెల 17లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అభివృద్ధి పనులపై అసంతృప్తి



బాలానగర్: మండలంలోని పెద్దాయపల్లిలో ఏర్పాటు చేసిన వన నర్సరీని రాష్ట్ర సర్వశిక్ష అభియాన్ ప్రత్యేక అధికారిణి శ్రీదేవి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరిగిన పలు అభివృద్ధి పనుల గురించి ఆరా తీశారు. గ్రామంలో సీసీరోడ్ల నిర్మాణం, ఇంకుడు గుంతల ఏర్పాటు, మరుగుదొడ్లు, అంతర్గత మురుగు నీటి వ్యవస్థ, పల్లెప్రకృతి వనం, వననర్సరీ, గ్రామీణ క్రీడా ప్రాంగణాలను పరిశీలించారు. గ్రామంలో జరిగిన అభివృద్ధిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాన్ని స్వచ్ఛంగా, పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. మన ఊరిని శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తు చేశారు. ఆమెతోపాటు ఎంపీడీఓ కృష్ణారావు, ఎంపీఓ విజయకుమారి, సర్పంచ్ శంకరప్ప, ఏపీఓ రాజశేఖర్, కార్యదర్శి అనిల్ ఉన్నారు.

సివిల్స్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సివిల్స్ సర్వీస్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ సంక్షేమశాఖ అధికారి ఇందిర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాలకు చెందిన అభ్యర్థులు ఈనెల 10లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రతిభ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్లు ట్రస్మా అధ్యక్షుడు ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, తల్లిదండ్రులు ఈ నెల 16లోగా జిల్లాకేంద్రంలోని నవభారత విద్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

కేఎస్పీకి జూరాల నీరు

కోయిల్‌కొండ: జూరాల ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడంతో శుక్రవారం సాయంత్రం అయ్యవారిపల్లి వద్ద కోయిల్‌సాగర్ ప్రాజెక్టుకు చేరుకున్నాయి. అంతకుముందు జూరాల నుంచి శుక్రవారం ఉదయం తీలేరు పంపుహౌస్‌కు చేరుకోవడంతో అక్కడి అధికారులు పంపుల ద్వారా నీటిని విడుదల చేశారు. దీంతో సాగు, తాగునీటి కష్టాలు కొంత వరకు తీరనున్నాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేరుశనగ @ రూ.6,770

జడ్చర్ల: బాదేపల్లిలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం వేరుశనగ క్వింటాల్‌కు సరాసరిగా రూ.6,770 ధర పలికింది. అదేవిధంగా మొక్కజొన్న క్వింటాల్‌కు రూ.2,136, ఆముదాలకు రూ.5,845 లభించాయి.



విద్యార్థినిని పరీక్షిస్తున్న వైద్యుడు

హాహాకారాలు.. ఆర్తనాదాలు

అర్ధరాత్రి నిద్రిస్తున్న విద్యార్థినులు ఒక్కసారిగా కడుపు నొప్పితో బాధపడుతూ.. ఆర్తనాదాలు చేస్తూ ఆస్పత్రికి తీసుకెళ్లండని రోదించారు.. అర్ధరాత్రి ఒంటిగంట నుంచి తమ పరిస్థితి గురించి అక్కడే ఉన్న సీఆర్‌టీలకు విన్నవించినా పట్టించుకోకుండా తగ్గుతుందిలే అని నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఉదయానికి పరిస్థితి మరింత విషమించడంతో పాటు బాధిత విద్యార్థినులు పెరగడంతో అప్పటికప్పుడు అంబులెన్స్‌లను రప్పించి ఆస్పత్రులకు తరలించారు. ఏకంగా 60 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురవడం, ఇందులో 12 మంది పరిస్థితి విషమంగా మారిన సంఘటన అమరచింతలోని కేజీబీవీలో చోటుచేసుకుంది. ఈ విషయం అంతటా వ్యాపించడంతో జిల్లా అధికారులతోపాటు విద్యార్థినుల తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు పెద్దఎత్తున అక్కడికి చేరుకుని.. తమ పిల్లలను ఆస్పత్రులకు, ఇళ్లకు తీసుకెళ్లారు.

కేజీబీవీలో విద్యార్థినుల అస్వస్థతతో ఉలిక్కిపాటు

- తమ పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లిన తల్లిదండ్రులు
- నాణ్యతలేని కూరగాయలు, భోజనాలతో వడ్డిస్తున్నారని ఆవేదన
- పాఠశాలలపై కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

అమరచింత/ ఆత్మకూర్: నిరుపేద, అనాథ పిల్లల కోసం కేజీబీవీలు ఏర్పాటు చేసి మెరుగైన విద్యతో పాటు పౌష్టికత్వంతో కూడిన ఆహారం అందిస్తున్నామని ప్రభుత్వం గొప్పగా ప్రకటనలు ఇస్తున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. కొన్నిరోజులుగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎక్కడో ఒకచోట భోజనాలు బాగుండటం లేదని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీల విద్యార్థులు వెలుగుచూస్తూనే ఉన్నాయి. అయితే తాజాగా అమరచింత మండలంలోని పామిరెడ్డిపల్లి శివారులో ఉన్న కేజీబీవీలో ఏకంగా 60 మంది విద్యార్థినులు ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురవడం అక్కడి పరిస్థితులు తేటతెల్లం చేశాయి. ఇక్కడ మొత్తం 340 మంది విద్యార్థినులు ఉండగా గురువారం 270 మంది విద్యార్థినులు హాజరయ్యారు. వీరికి ప్రతినిత్యం ఆహారం అందించేందుకు సరైన వంట మనుషులు లేకపోవడంతో ఉన్న సిబ్బందితోనే నెట్టుకొస్తున్నారు. దీంతో సరైన భోజనం పెట్టడం లేదని, రుచిగా లేని కూరగాయలు చేస్తున్నారని విద్యార్థినులు వాపోయినా పట్టించుకొనే నాథుడే లేకుండాపోయారు.

పిల్లల ఇళ్ల బాట..

కేజీబీవీలో విద్యార్థినులకు ఫుడ్‌పాయిజన్ అయ్యిందన్న సమాచారంతో తల్లిదండ్రులు పెద్దఎత్తున పాఠశాలకు చేరుకున్నారు. అస్వస్థతకు గురైన వారిలో తమ పిల్లలు ఉన్నారా.. లేదా అన్న వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అస్వస్థతకు తమ పిల్లలను చూసుకునేందుకు ఆస్పత్రులకు వెళ్లగా.. బాగున్న పిల్లలను తల్లిదండ్రులకు ఇళ్లకు తీసుకెళ్లిపోయారు. కొందరు పిల్లలు మాత్రం అధికారులు, ప్రజాప్రతినిధులు ధైర్యం చెప్పడంతో పాఠశాలలోనే ఉండిపోయారు.

మెరుగైన వైద్యసేవలు

విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్ అన్నారు. ఆత్మకూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఆయన పరిశీలించి.. వైద్యసేవలపై అధికారులకు సూచనలు చేశారు. వనపర్తి జనరల్ ఆస్పత్రిలో విద్యార్థినులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని, అక్కడ కలెక్టర్ దగ్గరుండి చూసుకుంటున్నారని వనపర్తి ఆర్డీఓ పద్మావతి, జీసీడీఓ సుబ్బలక్ష్మి, తహసీల్దార్ సింధూజ తెలిపారు.

బోరు నీరే దిక్కు

పాఠశాలలో మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో ప్రతినిత్యం బోరు నీటినే విద్యార్థినులు వినియోగించుకుంటున్నారు. స్నానాలతోపాటు తాగడానికి, వంట చేయడానికి ఈ నీటినే వాడుతున్నారు. దీంతో నీటి కాలుష్యం జరిగిందా అన్న అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. **వీటికి తోడు కేజీబీవీలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కిందిస్థాయి సిబ్బంది** నిర్లక్ష్యంగా వల్ల ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు



కుళ్లిన గుడ్లే కారణమా?



విద్యార్థినులకు కుళ్లిపోయిన కోడిగుడ్లే ఉడక్కబెట్టి ఇచ్చారని, వాటి వల్లే పిల్లలు అస్వస్థతకు గురయ్యారని పలువురు తల్లిదండ్రులు ఆరోపించారు. దీనికి తోడు ఉడకని అన్నంలో పురుగులు పట్టిన కూరగాయలు, టమాటలతో తయారు చేసిన భోజనం చేయడం వల్లే ఇలాంటి పరిస్థితి దాపురించిందని, ఇందుకు కారణమైన ప్రతిజక్కరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



వనపర్తి జిల్లా జనరల్ ఆస్పత్రిలో విద్యార్థిని పరామర్శిస్తున్న కలెక్టర్

ఒక్క క్షణం ఇక్కడుండొద్దు

- కేజీబీవీ ఎస్‌ఓపై ఎమ్మెల్యే ఆగ్రహం

'ఎంతో ఉన్నత ఆశయాలతో ప్రభుత్వం కేజీబీవీలు ఏర్పాటు చేసింది.. అలాంటి పాఠశాలలో చదివే పిల్లల ఆరోగ్యం క్షీణించే వరకు ఏం చేస్తున్నారు.. వారి ప్రాణాలకు ఏదైనా జరిగితే ఎవరికి నష్టం జరిగేదో ఆలోచించవా' అంటూ ఎస్‌ఓ స్వప్నరాణిపై ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారు అక్కర్లేదని, వెంటనే ఇక్కడి నుంచి పంపించేయండని జీసీడీఓ శుభలక్ష్మిని ఆదేశించారు. ఆర్డీఓ పద్మావతి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్, జీసీడీఓతో కలిసి కేజీబీవీని సందర్శించారు. పాఠశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం, గుడ్డు పొట్టు సైతం ఉండటం ఏమిటని ప్రశ్నించారు. రాత్రివేళలో పాఠశాలలో ఉండాల్సిన ఏఎన్‌ఎం ఎక్కడ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలలో ఉన్న విద్యార్థినులకు ధైర్యం చెప్పారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు.



ఎస్‌ఓపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

శాంపిల్స్ సేకరణ..

పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరిగిందన్న సంఘటనతో జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నకిలీ ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాలలో వంట పదార్థాల శాంపిల్స్‌ను సేకరించారు. చింతపండులో పురుగులు ఉన్నాయని వీటిని మార్చాలని సూచించారు. మిగిలిన ఆహార, కూరగాయల షాంపిల్స్ తీసుకున్నారు. టమాట కుళ్లినవి కూరలో వినియోగించారా అన్న వివరాలను వంట మనుషులను అడిగి తెలుసుకున్నారు.

ముగ్గురిపై వేటు

అమరచింత కేజీబీవీలో విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటనపై కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సీరియస్‌గా స్పందించారు. కేజీబీవీ ఎస్‌ఓ స్వప్నరాణిని ఉద్యోగం నుంచి తొలగిస్తూ, ఇన్‌చార్జ్ డీఈఓ గోవిందరాజులు, జీసీడీఓ సుబ్బలక్ష్మికి శుక్రవారం రాత్రి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కొత్తకోట ఎస్సీ హాస్టల్ వార్డెన్ సంతోష్‌ను సస్పెండ్ చేశారు.

'మన బడి' పనులు వేగిరం చేయండి



కేజీబీవీలో వంటలను పరిశీలిస్తున్న డీఈఓ రవీందర్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని డీఈఓ రవీందర్ అన్నారు. ఈ మేరకు జిల్లాకేంద్రంలోని ఆర్వీఎం సమావేశంలో వివిధ మండలాల అధికారులు, హెచ్‌ఎంలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మన ఊరు– మన బడి కార్యక్రమంలో పనులను వేగవంతంగా జరిగే విధంగా చూడాలని, బడిబాటలో ఎక్కువ అడ్మిషన్లు వచ్చేలా చూడాలని, యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు విద్యార్థులకు సకాలంలో అందించాలని సూచించారు. ప్రతి నాలుగో శనివారం రోజు నో బ్యాగ్‌ను పాటించాలని, ఉపాధ్యాయులు తరగతి గదిలో సెల్‌ఫోన్లు వినియోగించవద్దని ఆదేశించారు.

కేజీబీవీ ఆకస్మిక తనిఖీ

మండలంలోని ధర్మాపూర్ వద్ద ఉన్న కేజీబీవీని డీఈఓ రవీందర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ చదువుపై దృష్టి పెట్టి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలన్నారు. వంటగదిని పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వంట సిబ్బందికి చెప్పారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎరువులు, విత్తనాల కొరత తలెత్తొద్దు

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): రైతులు నూతన సాంకేతిక విధానాలను అవలంబిస్తూ పంటలు సాగు చేస్తే మంచి లాభాలు ఆర్జించవచ్చని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేష్ అన్నారు. శుక్రవారం జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏడీఏలు, ఏఓలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ప్రస్తుత వానాకాలంలో రైతులు సాగు చేస్తున్న పంటలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటలు సాగు చేసేలా వారిని అవగాహన కల్పించాలన్నారు. ఎక్కడా కూడా విత్తనాలు, ఎరువుల కొరత తలెత్తకుండా చూడాలని సూచించారు. రైతుబీమా కోసం ఈ నెల 10 నుంచి ఆగస్టు 5 వరకు కొత్తగా నమోదు ప్రక్రియ కొనసాగుతుందని, కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు ఏఈఓలను సంప్రదించాలని కోరారు. సమావేశంలో ఏడీఏలు హైమావతి, యశ్వంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బలోపేతానికి కృషి చేయాలి

ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీదేవి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ పురోగతి కోసం ఉద్యోగులు కృషి చేయాలని రీజినల్ మేనేజర్ శ్రీదేవి అన్నారు. రీజియన్‌లో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులను శుక్రవారం కార్యాలయంలో అభినందించి, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఆర్‌ఎం మాట్లాడుతూ రీజియన్‌కు పలు విభాగాల్లో పురస్కారాలు లభించడం సంతోషంగా ఉందన్నారు. మహబూబ్‌నగర్ డిపో లాభాల్లోకి వచ్చి రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలిచిందని, ఇదే స్ఫూర్తితో రీజియన్‌లో అన్ని డిపోలు లాభాల్లోకి రావాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ శ్యామల, పీఓ శ్రీనివాస్‌రెడ్డి, మహబూబ్‌నగర్ డిపో మేనేజర్ సుజాత, డిపో మేనేజర్లు పాల్గొన్నారు.



ఉద్యోగులను అభినందిస్తున్న ఆర్‌ఎం

ప్రభుత్వాల వైఫల్యాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరించాలని జాతీయ యువజన కాంగ్రెస్ కార్యదర్శి, యూత్‌జోడో–బూత్‌జోడో ఇన్‌చార్జ్ వివేక్ యోగెల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం యువజన కాంగ్రెస్ యూత్ జోడో–బూత్ జోడో కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అందించడం లేదన్నారు. ఈ విషయాన్ని ఇంటింటికి వెళ్లి వివరించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అమలు చేయనున్న పథకాలు, యూత్ డిక్లరేషన్ గురించి చెప్పాలని సూచించారు. యూత్‌జోడో–బూత్‌జోడో యాప్‌లో ప్రతి ఒక్కరికీ సభ్యత్వం ఇవ్వాలని సూచించారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో జాతీయ కోఆర్డినేటర్, అసెంబ్లీ ఇన్‌చార్జ్ నరసింహయాదవ్, ఆచార్య, రాంసింగ్, జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ హక్, నరేష్‌యాదవ్, అసెంబ్లీ అధ్యక్షుడు జె.చంద్రశేఖర్, బాబుయాదవ్, శివశంకర్‌గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాతీయ యువజన కాంగ్రెస్ కార్యదర్శి వివేక్ యోగేల్

మండలాధ్యక్షుల నియామకం

దేవరకద్ర: నియోజకవర్గంలోని 8 మండలాలతో పాటు రెండు మున్సిపాలిటీలకు కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులను నియమించింది. డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ కొత్త అధ్యక్షుల జాబితాను శుక్రవారం రాత్రి విడుదల చేశారు. ఇందులో దేవరకద్ర మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా కె.రాజేశ్వర్‌రెడ్డి, భూత్పూర్ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి, భూత్పూర్ మున్సిపాలిటీ అధ్యక్షుడిగా నవీన్‌గౌడ్, అడ్డాకుల అధ్యక్షుడిగా శ్రీహరి, చిన్నచింతకుంట అధ్యక్షుడిగా నరేందర్‌రెడ్డి, కొత్తకోట అధ్యక్షుడిగా మాసన్న, కొత్తకోట మున్సిపాలిటీ అధ్యక్షుడిగా శ్రీనివాసులు, మదనాపురం అధ్యక్షుడిగా నాగన్న, మూసాపేట చంద్రశేఖర్, కౌకుంట్ల అధ్యక్షుడిగా రాఘవేందర్‌రెడ్డి నియమించారు.

రోడ్డు ప్రమాదాలు తగ్గించడంలో సఫలం

- ఎస్పీ కె.నరసింహ వెల్లడి

బాలానగర్: జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు చేసిన కృషి సత్ఫలితాలు సాధించిందని ఎస్పీ కె.నరసింహ అన్నారు. అలాగే దొంగ డాక్యుమెంట్ పత్రాలతో డబుల్ రిజిస్ట్రేషన్లకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే రౌడీషీటర్, పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. శుక్రవారం బాలానగర్‌లోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను పరిశీలించి పోలీసులు పనితీరు మెరుగ్గా ఉందన్నారు. జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణలో ఎంతో ప్రగతి సాధించామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి దోషులకు కోర్టులో కఠిన శిక్ష పడేలా చూస్తామన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన సామన్య ప్రజల ఫిర్యాదులు స్వీకరించడంతోపాటు తగు విచారణ జరిపి త్వరగా న్యాయం చేస్తామన్నారు. ప్రతినెలా రౌడీ షీటర్లకు, నేరస్తులకు కౌన్సిలింగ్ ఇచ్చేలా చర్యలు చేపడుతామన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రజలతో పోలీసులు మరింత సత్సంబంధాలు ఏర్పరచుకొని శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ఇసుక, పీడీఎస్ రైస్ అక్రమ రవాణాపై నిఘా ఉంచి నియంత్రించాలని కోరారు. పోలీసులకు సమయం దొరికినప్పుడల్లా వ్యాయామం, యోగా వంటివి చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఆయన వెంట డీఎస్పీ మహేష్, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, రూరల్ సీఐ జమ్ములప్ప, ఎస్‌ఐ శ్రీనివాస్, జయప్రసాద్, లక్ష్మణ్‌నాయక్, సిబ్బంది ఉన్నారు.



ఇంటింటా ఇన్నోవేటర్ నమోదు చేయించాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రవినాయక్ తదితరులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): గ్రామస్థాయిలో వ్యవసాయం, ఆరోగ్యం, విద్య, మహిళా సంఘాలు, పంచాయతీరాజ్, ఇతర రంగాల్లో ఏదైనా ఒక నూతన ఆవిష్కరణ జరిగి ఉంటే వాటిని ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంలో నమోదు చేయించాలని కలెక్టర్ రవినాయక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఇంటింటా ఇన్నోవేటర్ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. దైనందిన జీవితంలో మనం ఎదుర్కొనే సమస్యలను చిట్కాలతో సులువుగా చేయగలిగే ప్రతీది ఆవిష్కరణగా భావించవచ్చన్నారు. అలాంటి నూతన ఆవిష్కరణలు వ్యవసాయ రంగంలో గ్రామస్థాయిలో అనేకం ఉంటాయని, వాటిని తెలుసుకుని ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమానికి పంపించేందుకు సెల్ నం .91006 78543కు వాట్సాప్ పంపించాలని కోరారు. ఆగస్టు 15న జరిగే వేడుకల్లో పరేడ్ గ్రౌండ్‌లో ఒక స్టాల్ ఏర్పాటు చేసి ఆవిష్కరణలను ప్రదర్శించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఈడీఎం చంద్రశేఖర్, డీపీఓ వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు, టీఎస్‌ఐసీ ప్రతినిధి రమేష్, డీఐఓఎస్‌ఐసీ సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపరింటెండెంట్ అరుంధతి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలి

ధరణి పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి ఆయన వీసీ నిర్వహించారు. జీఓ 59 కింద గతంలో వచ్చిన దరఖాస్తులలో రూ.10 లక్షల కంటే అధికంగా చెల్లించాల్సిన దరఖాస్తుదారులు ఇప్పటి వరకు చెల్లింపులు ప్రారంభించలేదని వెంటనే వారికి నోటీసులు జారీ చేసి చెల్లింపు చేసేలా చూడాలన్నారు. ధరణిలో కొత్తగా 5 మాడ్యుల్స్ అందుబాటులోకి వచ్చాయని, ఫలితంగా సేవలను విస్తృతం చేయడంతోపాటు చిన్న లోపాలను సవరించడం జరుగుతుందన్నారు. ఆర్‌ఎస్‌ఆర్ ప్యూరిఫికేషన్ కోసం ముందస్తుగా 5 ఎకరాలపై ఉన్న కేసులను మండలాల వారిగా విభజించి పరిష్కరించందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

రేవంత్‌తో గద్వాల జెడ్పీచైర్‌పర్సన్ భేటీ

గద్వాల టైౖం: టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డితో జోగుళాంబ గద్వాల జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఆమె భర్త తిరుపతయ్య శుక్రవారం భేటీ అయ్యారు. హైదరాబాద్‌లోని రేవంత్‌రెడ్డి గృహంలో సమావేశమై.. పలు విషయాలు చర్చించినట్లు సమాచారం. త్వరలో కొల్లాపూర్‌లో నిర్వహించే కాంగ్రెస్ బహిరంగసభలో బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరనున్నట్లు తెలుస్తోంది. గద్వాల అసెంబ్లీ స్థానానికి కాంగ్రెస్ పార్టీ నుంచి జెడ్పీచైర్‌పర్సన్ పోటీలో ఉండేందుకు క్రియాశీలకంగా ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికి తోడు స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డితో విభేదాలు, పలు అంతర్గత కారణాల వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. రేవంత్‌రెడ్డితో భేటీ నేపథ్యంలో జెడ్పీచైర్‌పర్సన్ పార్టీ మార్పు, గద్వాల నుంచి ఎమ్మెల్యే స్థానానికి పోటీకి లైన్ క్లియర్ అయినట్లు సమాచారం.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి


మాణిక్యప్ప(ఫైల్)

కోస్గి: వ్యవసాయ పొలం వద్ద బోరు మోటారు ఆన్ చేసేందుకు వెళ్లిన ఓ రైతు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన సంఘటన మండల పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితులు, గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని కొత్తపల్లికి చెందిన మణిక్యప్ప గౌడ్(48) తన వ్యవసాయ పొలంలో బోరుమోటార్ ఆన్ చేసేందుకు వెళ్లాడు. విద్యుత్ వైర్లు తెగి పడిన విషయాన్ని గుర్తించకపోవడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన పక్క పొలం రైతులు విద్యుత్ సరఫరా నిలిపి వేయించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి, అతడిని ఓ ప్రైవేట్ వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పంచనామా చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సంఘటనపై మృతుని భార్య చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలియజేశారు. అతనికి భార్యతో పాటు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



బిజినేపల్లి: ఇంట్లో ఖాళీగా ఉండకుండా ఏదైనా పని చేసుకోవాలని కుటుంబసభ్యులు సూచించడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బిజినేపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా.. బిజినేపల్లికి చెందిన వెంకటయ్య (54) గత కొన్ని రోజులుగా ఏ పని చేయకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. ఇదే విషయమై కుటుంబ సభ్యులు ఏదైనా పని చూసుకోవాలని సూచించారు. దీంతో మనస్తాపానికి గురైన వెంకటయ్య గురువారం ఇంట్లో నుంచి బయటికి తిరిగి రాలేదు. శుక్రవారం వినాయక వెంచర్‌లో అతని మృతదేహం స్థానికుల కంట పడింది. మనస్తాపానికి గురై పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఇన్‌చార్జ్ ఎస్ సద్దాం హుస్సేన్ తెలిపారు. మృతుడికి భార్య శాంతమ్మ, కూతురు, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వెల్దండ: మండల కేంద్ర సమీపంలో శుక్రవారం రాత్రి ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. వివరాలిలా.. ఉప్పునుంతలకు చెందిన ఉప్పునుంత విష్ణుచారి(38) హైదరాబాద్‌లో తన కుమారుడిని హాస్టల్‌లో చేర్పించి బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో వెల్దండ సమీపంలో హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వెనక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న విష్ణుచారి తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విష్ణుచారికి భార్య లావణ్యతోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

మద్దూరు: పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం మండల కేంద్రం బస్టాండ్‌లో చోటు చేసుకుంది. బంధువులు వివరాల మేరకు.. దామరగిద్ద మండలంలోని నర్సపూర్ గ్రామానికి చెందిన గోవిందమ్మ(40)కు ఉల్లిగుడం గ్రామానికి చెందిన వ్యక్తితో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలం తర్వాత ఆమె భర్త నుంచి విడిపోయి తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. ఆమెకు ఆరోగ్యం బాగలేకపోవడంతో అక్క దేవేంద్రమ్మతో కలిసి మద్దూరు ప్రభుత్వాసుపత్రికి వెళ్లారు. చికిత్స అనంతరం తమ గ్రామానికి వెళ్లడానికి బస్టాండ్‌కు వచ్చారు. దేవేంద్రమ్మ చెల్లెలిని బస్టాండ్‌లో ఉంచి వ్యవసాయ విత్తనాలు తీసుకరావడానికి వెళ్లింది. గోవిందమ్మ మూత్రశాలకు వెళ్లి పురుగుల మందు తాగి బస్టాండ్‌లోకి వచ్చి వాంతులు చేసుకుంది. దీన్ని గమనించిన ప్రయాణికులు 108కు సమాచారం అందించారు. ఆమెను వెంటనే ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

రామన్ పాడులో తగ్గిన నీటిమట్టం

మదనాపురం : మండల పరిధిలోని రామన్ పాడు జలాశయంలో నీటిమట్టం తగ్గుతోంది. జూరాల ఎడమ, సమాంతర, ఎన్‌టీఆర్ కాలువల ద్వారా వచ్చే నీటిని నిలిపి, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ తెలిపారు.

పర్యవేక్షణ ఏది..?


వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్‌లోని కేజీబీవీలో భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మురళి

- విద్యాలయాల్లో కనిపించని ఫుడ్, పేరెంట్స్ కమిటీలు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఒకే ఒక్క ఫుడ్ ఇన్‌స్పెక్టర్
- నామమాత్రంగా తనిఖీలు, శాంపిల్స్ సేకరణ
- అమరచింత కేజీబీవీ ఘటనతో ఉలిక్కిపాటు
- ఘటనపై కలెక్టర్ అత్యవసర సమావేశం

వనపర్తి: 'మంది ఎక్కువైతే.. మజ్జిగ పలుచన' అన్న చందంగా మారింది విద్యాలయాల్లో ఆహార తనిఖీల ప్రక్రియ. గురుకులాలు, కేజీబీవీల సంఖ్య పెంచామని గొప్పగా చెప్పుకొనే పాలకులు విద్యార్థులకు సరిపడా సౌకర్యాలు, అందించే ఆహారంలో నాణ్యతా ప్రమాణాలను పాటించేలా చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శుక్రవారం వనపర్తి జిల్లాలోని అమరచింత కేజీబీవీలో ఒకేసారి 60 మందికిపైగా విద్యార్థినులు ఆహార కల్తీతో అస్వస్థతకు గురవడం ఇందుకు నిదర్శనంగా నిలిచింది. ఆయా విద్యాలయాలు, హాస్టళ్లకు సరఫరా చేస్తున్న కూరగాయలు, మాంసం, కిరాణం సామగ్రి టెండర్లను ఏళ్ల తరబడిగా ఒక్కరికే ఇవ్వడం వలన నాసిరకమైన వస్తువుల సరఫరాకు కారణమవుతోంది. ఇక కూరగాయల విషయానికి వస్తే.. అతి తక్కువ ధరకు టెండర్లు దక్కించుకునే కూరగాయల విక్రయదారులు మార్కెట్‌లో విక్రయించగా మిగిలిన ఆకు, కూరగాయలను సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో అమరచింత వంటి ఘటనలు చోటు చేసుకున్నప్పుడు తప్ప.. సాధారణ సమయాల్లో తనిఖీలు నిర్వహించిన దాఖలాలు ఇటీవల కాలంలో దాదాపుగా లేవనే చెప్పాలి. ఇటీవల గోపాల్‌పేట ప్రాథమిక పాఠశాలలో పురుగులు పడిన బియ్యంతో వండిన అన్నమే విద్యార్థులకు వడ్డించారు. మీడియాలో ఈ విషయం వచ్చిన తర్వాతనే అధికారుల స్పందన ఉందంటే పర్యవేక్షణ ఏ తీరున ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఫుడ్ కమిటీలెక్కడా..?

గురుకులాలు, కేజీబీవీ, పాఠశాలలు, హాస్టళ్లలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో ఫుడ్, పేరెంట్స్ కమిటీలను ఏర్పాటు చేయాలి. ఈ కమిటీలు నిర్దేశిత సమయాల్లో అక్కడి ఆహారం, సరఫరా చేస్తున్న పాలు, మాంసం, ఆకు, కూరగాయలు, కిరాణ సామగ్రి, తాగునీటిలో నాణ్యతా ప్రమాణాలను పరిశీలిస్తూ.. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేలా పర్యవేక్షించాలి. అయితే కరోనా విపత్కర పరిస్థితుల తర్వాత ఈ నిబంధనలను అధికారులు పట్టించుకోని కారణంగా కమిటీల ఏర్పాటును పక్కనపెట్టినట్లు సమాచారం.

ఐదు జిల్లాలకు ఒక్కరే..

ఉమ్మడి పాలమూరులోని మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట, గద్వాల జిల్లాలకు ప్రస్తుతం ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా నీలిమ ఒక్కరే పనిచేస్తుండటం గమనార్హం. ఇది వరకు మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాలను పర్యవేక్షించే ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మనోజ్ కొంతకాలం క్రితం దీర్ఘకాలిక సెలవులో వెళ్లడంతో నీలిమ ఒక్కరే దిక్కయ్యారు. దీంతో ఈమెనే ఐదు జిల్లాల బాధ్యతలు నిర్వర్తిస్తుండటంతో ప్రైవేటు, ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలు, కేజీబీవీ, హోటళ్లలో ఆహార కల్తీ పరీక్షలు నెమ్మదించాయని చెప్పవచ్చు.

నివేదిక ఇచ్చాం..

గత విద్యా సంవత్సరంలో వనపర్తి జిల్లాలోని పలు గురుకులాలు, కేజీబీవీలు, హాస్టళ్లను తనిఖీ చేసి శాంపిల్స్ సేకరించి.. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం బాగోలేదని మా శాఖ కమిషనర్‌కు నివేదిక అందజేశాం. అక్కడి నుంచి ఆయా సొసైటీలకు విద్యా శాఖ ఉన్నతాధికారులకు సమాచారం పంపిస్తారు. ఈ విద్యా సంవత్సరం ఇప్పటి వరకు ఏ ప్రభుత్వ విద్యాలయంలోనూ తనిఖీలు చేపట్టలేదు.
– నీలిమ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, మహబూబ్‌నగర్

అందరూ క్షేమంగా ఉన్నారు..

అమరచింతలోని కేజీబీవీ విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్లు సమాచారం తెలియగానే.. ఆస్పత్రికి తరలించేలా ఆదేశాలిచ్చాం. కొందరికి మెరుగైన వైద్యం కావాల్సి ఉందని వనపర్తి జనరల్ ఆస్పత్రికి పంపించాం. ప్రస్తుతం విద్యార్థినులు అందరూ ఆరోగ్యంగానే ఉన్నారు. అస్వస్థతకు గల కారణాలపై విచారణ చేస్తున్నాం. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాత్రి ఆహారం శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపించారు. – సుబ్బలక్ష్మి, జీసీడీఓ, వనపర్తి

ఫలితాలు వస్తేనే..

అమరచింత కేజీబీవీ నుంచి వచ్చిన విద్యార్థుల్లో పూజిత, మౌనికలకు కడుపునొప్పి కొద్దిగా ఎక్కువగా వచ్చింది. కలుషితమైన నీరు, ఆహారం, కూరగాయలు, ముక్కిపోయిన పప్పు లాంటివి ఆహారంలో కలిసినా.. పురుగులు, ఇతర కీటకాలు ఆహారంలో పడినా.. ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటాయి. ఈ విద్యార్థినులు ఎందుకు అస్వస్థతకు గురయ్యారో ల్యాబ్‌కు పంపించిన శాంపిల్స్ ఫలితాలు వస్తేనే ఖచ్చితంగా చెప్పగలం.
– రాజ్‌కుమార్, డీసీహెచ్‌ఎస్, జనరల్ ఆస్పత్రి, వనపర్తి

చిరుత సంచారంపై అధికారుల పరిశీలన


చిరుత జాడలను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

అడ్డాకుల: మూసాపేట మండలంలోని సంకలమద్ది శివారులోని పెద్దగుట్ట వద్ద శుక్రవారం జిల్లా అటవీశాఖ అధికారులు చిరుత జాడ కోసం పరిశీలన చేపట్టారు. అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు, బీట్ ఆఫీసర్ శశికళలు పెద్దగుట్ట, ముత్యం గుండు వద్ద చిరుత జాడల కోసం వెతికారు. అయితే ఆయా చోట్ల చిరుత జాడలు కనిపించలేదని సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు తెలిపారు. జూన్ 27న ఇవే ప్రదేశాల్లో చిరుత సంచరిస్తోందన్న సమాచారంతో అదే రోజు పరిశీలన చేపట్టామని తెలిపారు. చిరుత సంచారం చేసే చోట గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెలను ఉంచవద్దని రైతులకు సూచించినట్లు తెలిపారు. అయినా కాపరులు గొర్రెలను గుట్ట వద్దకు తీసుకెళ్లారని, కొన్నాళ్ల పాటు గుట్ట పరిసరాలకు జీవాలను తీసుకెళ్లవద్దని కాపరులు, రైతులకు తాజాగా సూచనలు చేశారు. చిరుతను బంధించే అవకాశం లేదని అధికారులు తెలిపారు. మనుషులపై అవి దాడి చేసే అవకాశం కూడా లేదని చెప్పారు. చిరుతలు ఆహారం అందకపోతే ఈ ప్రాంతం నుంచి వెళ్లిపోతాయని, ఇందు కోసం గుట్ట పరిసరాల్లో ఎలాంటి జీవాలను ఉంచకుండా జాగ్రత్త వహించాలని అధికారులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా వర్షాలు లేక పొలాలు ఎండిపోయి ఉండటంతో చిరుత జాడలు కనిపించడం లేదని రైతులు అంటున్నారు. గురువారం గొర్రెల మందపై చిరుత దాడి చేయడాన్ని దగ్గరుండి చూశామని కాపరులు చెబుతున్నా అధికారులు చిరుత రాలేదని అంటున్నారని రైతులు వాపోతున్నారు. అటవీశాఖ అధికారులు చిరుతను బంధించే ప్రయత్నాలు చేయడం లేదని కాపరులు, రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఇంటర్ సప్లిమెంటరీలో 'ప్రతిభ' విద్యార్థుల సత్తా

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల్లో మహబూబ్‌నగర్‌లోని ప్రతిభ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఎంపీసీ మొదటి సంవత్సరంలో అనిత 467, చరణ్‌లాల్ 466, సాత్విక్ 466, అన్వరుద్దీన్ 466, నమిత 466, శిరీష 466 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో సౌందర్య 435, ఎవాన్జిలీన్ 435, అయిషాసిద్దికి 435, కిబ్రా ఫాతిమా 434, ఫహమిద 434, సుప్రజ 434 మార్కులు సాధించారు. ఈ మేరకు ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది.

రెండు రోజుల్లో ఆర్‌ఐలకు స్థానచలనం?

మహబూబ్‌నగర్ క్రైం: ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో ఉమ్మడి జిల్లాలోని పోలీస్‌శాఖలో సమూలంగా మార్పులు చేర్పులు జరుగుతున్నాయి. ఇప్పటికే పలు దఫాలుగా ఎస్‌ఐలు, సీఐలకు స్థానచలనం కల్పించారు. ఎస్‌ఐలకు సంబంధించిన బదిలీలు అయితే దాదాపు పూర్తి అయినట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో కొన్ని స్థానాల్లో సీఐలు బదిలీ చేయాల్సి ఉంది. దీంతో పాటు మరో రెండు రోజుల వ్యవధిలో మల్టీజోన్–2 కింద ఉన్న ఆర్‌ఐలను బదిలీ కానున్నారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 15 మంది వరకు ఆర్‌ఐలు విధులు నిర్వహిస్తున్నారు. వీరందరికీ ఆయా జిల్లా హెడ్‌క్వార్టర్స్ నుంచి స్థానచలనం కలగనుంది.

ప్రజా సమస్యలపై ప్రజాహిత పాదయాత్ర


పాదయాత్ర కరపత్రాలను విడుదల చేస్తున్న టీపీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి, తదితరులు

జడ్చర్ల: ప్రజా సమస్యలను గుర్తించడంతోపాటు ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించేందుకు ప్రజాహిత పాదయాత్రను ఈనెల 9 నుంచి ప్రారంభిస్తున్నట్లు టీపీసీసీ కార్యదర్శి జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జడ్చర్లలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నవాబ్‌పేట మండలం ఫతేపూర్ మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పాదయాత్ర ప్రారంభం అవుతుందని ,గ్రామ గ్రామానికి తన పాదయాత్ర సాగుతుందని తెలిపారు. రెండు నెలల పాటు సాగే పాదయాత్ర నవాబ్‌పేట, రాజాపూర్, బాలానగర్, జడ్చర్ల, మిడ్జిల్ మండలాల గుండా కొనసాగి ఊర్కొండ మండలంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయం వద్ద ముగుస్తుందన్నారు. పాదయాత్రలో ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేయనున్న మేనిఫెస్టోను తెలియజేస్తామన్నారు. రూ.500లకే వంటగ్యాస్ సిలిండర్ ఇస్తామని, ఫించన్ రూ.4వేలకు పెంపుతోపాటు రైతుల రుణాలు ఒకే సారి రూ.2లక్షల మాఫీ, రైతుబంధు ఏటా ఎకరానికి రూ.15వేలు, కౌలు రైతులకు రూ.12వేలు వంటి అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను తెలియజేస్తామన్నారు. అంతేగాక గ్రామాల్లో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి సంబంధించి కూడా జడ్చర్ల మేనిఫెస్టోను ప్రకటిస్తామన్నారు.

ప్రభుత్వ వ్యతిరేక విధానాలు వివరిస్తాం

రాష్ట్రంలో బీఆర్‌ఎస్, కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వాలు చేపట్టిన ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తామన్నారు. జడ్చర్ల నియోజకవర్గంలో భూకబ్జాలు పెరిగిపోయావని, అధికార పార్టీ నాయకులు అక్రమాలు, ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎన్నికలు దగ్గర పడుతున్నాయని భావించి హడావుడిగా సరైన సౌకర్యాలు, సరిపడా సిబ్బంది లేకుండానే వంద పడకల ఆసుపత్రిని స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రారంభించారని ఆరోపించారు. పాదయాత్రలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఇంచార్జీ మాణిక్యరావుఠాక్రే, తదితర ముఖ్య నేతలు హాజరవుతారని తెలిపారు. ప్రజాహిత పాదయాత్రకు సంబంధించిన కరపత్రాలను ఈసందర్భంగా ఆయన విడుదల చేశారు.

బాధితులకు అండగా ఉంటాం..

తిరుమల వెంచర్‌లో తాము కొనుగోలు చేసిన ప్లాట్లను ఆక్రమించి కొత్తగా వెంచర్‌ను ఏర్పాటు చేసి చ.గ. రూ.16,500కు విక్రయిస్తున్నారని, తమకు ఎలాగైన న్యాయం చేయాలని కోరుతూ బాధితులు అనిరుధ్‌రెడ్డిని కలిసి తమగోడును వెళ్లబోసుకున్నారు. సంబంధిత అధికారులకు,పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎవ్వరు పట్టించుకోవడం లేదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆక్రమణలపై చర్యలు చేపట్టి న్యాయం చేస్తామని బాధితులకు ఆయన హామీ ఇచ్చారు. సమావేశంలో మాజీ ఎంపీపీ నిత్యానందం,వార్డు కౌన్సిలర్ విజయ్,నాయకులు అయ్యన్న,సర్ఫరాజ్,కృష్ణయ్య,అనిత,తదితరులు పాల్గొన్నారు.

సొరంగం పరిశీలన



జడ్చర్ల: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించి ఉదండాపూర్ రిజర్వాయర్ వరకు నిర్మించిన సొరంగాన్ని శుక్రవారం జడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులు సందర్శించారు. శంకరాయపల్లి తండా వద్ద సొరంగంలోకి వెళ్లి కర్వెన రిజర్వాయర్ నుంచి ఉదండాపూర్ రిజర్వాయర్‌కు నీటి తరలింపునకు సంబంధించి పరిశీలించారు. ఏపీఎం మాల్యానాయక్, సీసీలు ఈశ్వర్, స్వర్ణ పాల్గొన్నారు.

నిజామాబాద్‌కు తరలిన ఫుట్‌బాల్ జట్టు



జడ్చర్ల టౌన్: నిజామాబాద్ జిల్లాలో శనివారం నుంచి జరగబోయే రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ బాలికల ఫుట్‌బాల్ టోర్నీలో రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని జెడ్పీవైస్‌చైర్మన్ యాదయ్య సూచించారు. బాలికల జట్టు బాదేపల్లి జెడ్పీహైస్కూల్‌లో శిక్షణ పొంది శుక్రవారం సాయంత్రం నిజామాబాద్ బయలుదేరి వెళ్లిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన అభినందించారు. జట్టుకు అవసరమైన దుస్తులను సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు శశిధర్ అందజేశారు. కౌన్సిలర్ రఘురాంగౌడ్, జిల్లా ఫుట్‌బాల్ కార్యదర్శి గజానంద్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

జడ్చర్ల: ఫ్లెక్సీల హోరు–ప్రజల బేజారు శీర్షికతో శుక్రవారం సాక్షి దినపత్రికలో వచ్చిన వార్తా కథనం చర్చనీయాంశంగా మారింది. పట్టణంలో విచ్చలవిడిగా ఏర్పాటవుతున్న ఫ్లెక్సీలపై సోషల్ మీడియాలో సాక్షి కథనం చక్కర్లు కొట్టడంతో సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించారు. మహనీయుల విగ్రహాల చుట్టూ కట్టిన ఫ్లెక్సీలను తొలగించారు. అనుమతి లేకుండా ఫ్లెక్సీలు పెట్టిన వారికి జరిమానా విధించాలని స్థానికులు డిమాండ్ చేశారు. అనుమతులు లేని ఫ్లెక్సీల వ్యవహారంపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ షేక్ తెలిపారు.


అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పాలమూరు భారీ విజయం


జిల్లా క్రికెట్‌జట్టుతో రాజశేఖర్, కోచ్ అబ్దుల్లా తదితరులు

- టూడే లీగ్ మ్యాచ్‌లో బాలాజీ కోల్ట్స్ ఓటమి
- 286 పరుగుల తేడాతో గెలుపు

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో జరుగుతున్న హెచ్‌సీఏ బి–డివిజన్ టూడే లీగ్ ఛాంపియన్‌షిప్ లీగ్ మ్యాచ్‌లో ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. 286 పరుగుల తేడాతో బాలాజీ కోల్ట్స్ జట్టును మట్టికరిపించింది. తొలిరోజు జిల్లా జట్టు 5 వికెట్లకు 457 పరుగులు చేసింది. శుక్రవారం రెండో రోజు బాలాజీ కోల్ట్స్ బ్యాటింగ్‌కు దిగగా జిల్లా బౌలర్ల ధాటికి వరుసగా వికెట్లు కోల్పోయింది. 64.3 ఓవర్లలో 171 పరుగులకే ఆలౌట్ అయింది.

ఎండీసీఏ అభినందనలు...

హెచ్‌సీఏ టూడేలీగ్ మ్యాచ్‌లో జిల్లా క్రికెట్ జట్టు విజయం సాధించడంతో మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో టూడేలీగ్‌లో మెరుగైన ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోచ్ అబ్దుల్లా పాల్గొన్నారు.

పీయూలో సాఫ్ట్‌బాల్ క్రీడను ప్రవేశపెట్టాలి


పీయూ వీసీకి వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

మహబూబ్‌నగర్ క్రీడలు: పాలమూరు యూనివర్సిటీలో సాఫ్ట్‌బాల్ క్రీడను ప్రవేశపెట్టాలని జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం సభ్యులు శుక్రవారం పీయూ వీసీ ప్రొఫెసర్ లక్ష్మీకాంత్‌రాథోడ్‌కు వినతిపత్రం అందజేశారు. సాఫ్ట్‌బాల్ క్రీడను పెడితే ఎంతో మంది క్రీడాకారులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. దీంతో వీసీ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం సభ్యులు సాదిక్‌అలీ, నాగరాజు, రాఘవేందర్, జిల్లా ఆర్చరీ సంఘం కార్యదర్శి రాంచందర్ పాల్గొన్నారు.

ఫోర్జరీ సంతకంతో ప్లాట్లు కాజేసేందుకు యత్నం

- 11మందిపై కేసు నమోదు


కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ రజితారెడ్డి, ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి

భూత్పూర్: మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్ శివారులో గల వెంచర్లలో ఉన్న ప్లాట్లను ఫోర్జరీ సంతకంతో కాజేసేందుకు ప్రయత్నించిన 11 మందిపై కేసు నమోదు చేసినట్లు భూత్పూర్ సీఐ రజితారెడ్డి వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం విలేకర్ల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ జిల్లాకు చెందిన చంద్రమౌళీశ్వర్ 1990 సంవత్సరంలో భూత్పూర్ మండలంలోని అమిస్తాపూర్ శివారులోని సర్వే నంబరు 369, 370 భూమి కొనుగోలు చేసి ప్లాట్లుగా విక్రయించగా.. కొన్ని ప్లాట్లు మిగిలిపోయాయి. అమిస్తాపూర్, మహబూబ్‌నగర్‌కు చెందిన కెంద్యాల నరేందర్, ప్యాట వెంకటయ్య, మాధవరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ మిగిలిపోయిన ప్లాట్లపై కన్నేశారు. ఈమేరకు మాధవరెడ్డికి కర్నూల్ జిల్లాకు చెందిన శ్రీనివాస్‌రెడ్డి అనే మిత్రుడు ఉండగా..నలుగురు కలిసి శ్రీనివాస్‌రెడ్డిని కలిశారు. ఇతనికి చంద్రమౌళీశ్వర్ వద్ద పనిచేసిన సుబ్రమణ్యం పరిచయం ఉండడంతో అతనితోపాటు న్యూటన్ అనే మరో వ్యక్తి పరిచయం అయ్యారు. ఖాళీగా ఉన్న ప్లాట్లపై కన్నేసిన వీరు న్యూటన్ అనే వ్యక్తికి కొంత డబ్బు ఆశ చూపి అతనే చంద్రమౌళీశ్వర్‌గా వ్యహరించాడు. చివరికి మిత్రులైన మహేశ్వర్‌రెడ్డి, విఠల్‌పైన స్పెషల్ పవర్ ఆఫ్ అటోనమి (ఎస్‌పీఏ) హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశారు. కొన్ని రోజుల తర్వాత మహేశ్వర్‌రెడ్డి జడ్చర్ల సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అమిస్తాపూర్‌లోని తన పేరుపై రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్లాట్లను కెంద్యాల నరేందర్, ప్యాట వెంకటయ్య, మాధవరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌పై రిజిస్ట్రేషన్ చేశారు.

మరో చంద్రమౌళీశ్వర్ రాకతో విషయం బయటకు..

ఇదిలాఉండగా, గత నెల 24న జడ్చర్ల సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయానికి చంద్రమౌళీశ్వర్ అనే పేరుతో మరో వ్యక్తి వచ్చి అమిస్తాపూర్ శివారులోని 369, 370 సర్వేనంబర్లలో ఉన్న ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయమని సబ్‌రిజిస్ట్రార్ ఆనంద్‌కు పత్రాలు సమర్పించారు. దీంతో అనుమానం వచ్చిన సబ్‌రిజిస్ట్రార్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్పీ ఆదేశానుసారం భూత్పూర్ సీఐ రజితారెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి, పోలీసులతో విచారణ చేశారు. ఎస్‌పీఏ చేసుకున్న మహేశ్వర్‌రెడ్డికి చెందిన ఆధార్ కార్డు ఆధారంగా మహేశ్వర్‌రెడ్డిని అదుపులోకి తీసుకొని విచారించగా.. కర్నూల్‌కు చెందిన చంద్రమౌళీశ్వర్‌గా వ్యవహరించిన న్యూటన్ రిజిస్ట్రేషన్ చేశారని తెలిపారు. న్యూటన్‌ను విచారించగా శ్రీనివాస్‌రెడ్డి, దశరథ్, గోవర్ధన్‌రావు సాక్షులుగా ఉన్నారని, తానే చంద్రమౌళీశ్వర్‌గా వ్యవహరించినట్లు తెలిపారు. మహేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, న్యూటన్, గోవర్ధన్‌రావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు, ప్యాట వెంకటయ్య, కెంద్యాల నరేందర్, మాధవరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు విఠల్ పరారీలో ఉన్నట్లు సీఐ వెల్లడించారు. త్వరలో వారిని పట్టుకుంటామని సీఐ తెలిపారు.

క్లుప్తంగా

జయతీర్థుల ఆరాధన

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని శ్రీమద్ ఉత్తరాదిమఠం శ్రీసత్య ప్రమోదగిరిలో శుక్రవారం శ్రీమద్ టీకాచార్యులు (జయతీర్థుల) ఆరాధన మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీవేంకటేశ్వరస్వామి వారికి, మృత్తికా బృందావనానికి పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ పూజలు నిర్వహించారు. రథోత్సవం, అలంకారం, హస్తోదకం, మహామంగళహారతి నిర్వహించారు. కృష్ణమాచార్యులు, యదునందనాచార్యులు, రఘురామాచార్యులు, వాసుదేవాచార్యులు ప్రవచనం చేశారు.

ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలి

బాలానగర్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో శానిటైజేషన్ కార్మికుల వేతనాల్లో కోతలు విధిస్తున్న వెంకటయ్య ఏజెన్సీ గుర్తింపును రద్దు చేసి బ్లాక్ లిస్టులో పెట్టాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పీ.సురేష్ డిమాండ్ చేశారు. బాలానగర్‌లో శానిటైజేషన్ సుపర్‌వైజర్లకు చెల్లించే వేతనాల్లో భారీకోత పెడుతున్నారని ఆరోపించారు. అదే విధంగా వారికి చెల్లించే ఈఎస్ఐ, పీఎఫ్‌లలో కూడా అక్రమాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఘటనపై సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని కలెక్టర్ రవికి ఫిర్యాదు చేసినట్లు వివరించారు. నాయకులు నర్సింహ, మెగులయ్య, దేవానంద్, రంగన్న, యాదయ్య తదితరులు ఉన్నారు.

నులిపురుగులను నిర్మూలిద్దాం

రాజాపూర్: నులిపురుగులను నిర్మూలించేందుకు ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ఎంపీపీ సుశీల పేర్కొన్నారు. శుక్రవారం రాజాపూర్ పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలకు జాతీయ నులిపురుగుల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 20న నులిపురుగుల దినోత్సవం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. డాక్టర్ మధుసూదన్‌రావ్ మాట్లాడుతూ ఆకలి మందగించడం, కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు తదితర లక్షణాలు ఉంటాయని తెలిపారు. నిర్మూలన కోసం ఆల్బండజోల్ మాత్రలు ఇవ్వాలని సూచించారు.

ఎన్నికపై హర్షం

భూత్పూర్: పట్టణానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు సుదర్శన్‌రెడ్డిని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీందర్‌రెడ్డితోపాటు బీజేపీ పట్టణ అధ్యక్షుడు రవీందర్, ఆంజనేయులు, లక్ష్మారెడ్డి, సదానంద్, శ్రీను తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

పాలమూరు: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎగ్గని నర్సింహులును నియమిస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి శుక్రవారం నియామక పత్రాన్ని అందించారు.

పాదయాత్రను విజయవంతం చేద్దాం

నవాబుపేట: ప్రజా సమస్యల పరిష్కారం కోసం పీసీసీ ప్రధానకార్యదర్శి అనిరుధ్‌రెడ్డి ఆదివారం మండల మైసమ్మ ఆలయం నుంచి ప్రారంభించనున్న ప్రజాహిత పాదయాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ నాయకులు ఎంపీటీసీ తులసీరాం నాయక్, ఆంజనేయులు, కుమార్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో మాట్లాడుతూ నియోజకవర్గం మొత్తం యాత్ర సాగుతుందన్నారు. నాయకులు డాక్టర్ మీనాక్షి, సురేష్, సురేందర్, డేవిడ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

మండలం ఏర్పాటు చేస్తాం

కోయిల్‌కొండ: గార్లపహాడ్‌ను వచ్చే ఎన్నికల్లోపు ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి మండల కేంద్రంగా ప్రకటించకపోతే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఏర్పాటు చేస్తామని పార్టీ అధికారప్రతినిధి గాలెరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో 167వ రోజు చేపట్టిన రిలేదీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే ఎందుకు వివక్ష చూపిస్తున్నారని ఆయన మండిపడ్డారు. జేఏసీ కన్వీనర్ రామునాయక్, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

పొరపాట్లు చేస్తే చర్యలు తప్పవు



నవాబుపేట: పెండింగ్‌లో ఉన్న పింఛన్ డబ్బులు లబ్ధిదారులకు వెంటనే అందించాలని, మరోసారి పొరపాటు జరిగితే చర్యలు తీసుకుంటామని షాద్‌నగర్ ఎస్‌బీఎం ప్రభ తెలిపారు. శుక్రవారం దేపల్లిలో నిర్బంధంలో ఉన్న బీపీఎం చెన్నయ్య విషయంపై గ్రామానికి చేరుకుని ఆరా తీశారు. లబ్ధిదారులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని వివరించారు. డబ్బులు కాజేశారని ఆరోపణలతో ఉన్న వారికి వెంటనే ఇవ్వాలని సూచించారు. లేనిపక్షంలో చర్యలు తప్పవన్నారు. పునరావృతం అయితే సస్పెండ్ చేస్తామని బీపీఎం చెన్నయ్యను హెచ్చరించారు. అలాగే ఉపాధి కూలీల డబ్బులు సరిగా ఇవ్వాలని పేర్కొన్నారు. గ్రామాలకు వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు ఇవ్వాలన్నారు. పింఛన్లు అందరికీ ఇస్తానని అధికారుల ముందు వివరించిన బీపీఎం పెండింగ్‌లో ఉన్నవి సైతం ఇస్తామన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఫిర్యాదు చేయాలని ఎస్‌బీఎం ప్రభ సర్పంచ్ లతారెడ్డికి సూచించారు. అధికారుల సూచనలతో శాంతించిన గ్రామస్తులు నిర్బంధంలో ఉన్న చెన్నయ్యను వదిలిపెట్టారు.

సమస్యలపై నిలదీసిన సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి

చిన్నచింతకుంట: పలు అభివృద్ధి పనులపై మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశం చిన్నచింతకుంటలో శుక్రవారం ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సభ్యులు పలు సమస్యలపై లేవనెత్తడంతో రసాభాసగా మారింది. ఎంపీపీ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. విద్యుత్ అధికారులు రైతులతో ట్రాన్స్‌ఫార్మర్లకు డబ్బులు వసూళ్లు చేస్తున్నారని సర్పంచులు, ఎంపీటీసీలు తెలపడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బులు వసూలు చేస్తారా అంటూ మండిపడ్డారు. మన ఊరు మనబడి పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

జూనియర్ కళాశాల ఏర్పాటులో విఫలం

చిన్నచింతకుంటలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని కోఆప్షన్ మెంబర్ మహిమూద్ ఆరోపించారు. పది సంవత్సరాలు గడుస్తున్నా కళాశాల ఊసేలేదని అన్నారు. విద్యార్థులు దూర ప్రదేశాలకు వెళ్లలేక చదువులు మానేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా 70 ఏళ్ల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏంచేసిందని, అప్పుడు జూనియర్ కళాశాల ఎందుకు ఏర్పాటు చేయలేదని మద్దూర్ ఎంపీటీసీ ఫారూక్ ఈ సందర్భంగా కోఆప్షన్ మెంబర్‌ను నిలదీశారు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ సువర్ణరాజు, ముచ్చింతల వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ అభివృద్ధికి మరింత కృషి



సమావేశంలో పాల్గొన్న సభ్యులు, అధికారులు

నవాబుపేట: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో దాదాపు రూ. కోటితో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చైర్మన్ లక్ష్మయ్య తెలిపారు. శుక్రవారం పాలకవర్గం సభ్యులు, మార్కెట్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. మార్కెట్‌కు రూ.50 లక్షలతో షాపింగ్‌కాంప్లెక్స్, రూ. 10 లక్షలతో కార్యాలయం, మరో రూ. 30 లక్షలతో మార్కెట్‌లో సీసీ, మరుగుదొడ్ల నిర్మాణం చేస్తున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చొరవతో గతంలో రూ. 50 లక్షలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం మరోటి ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వైస్ చైర్మన్ చందర్‌నాయక్, సభ్యులు రవికుమార్, శశిధర్, నర్సింహులు, జగన్, చెన్నయ్య, సాయి, హనమంత్తు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ వ్యవస్థలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలోతెలంగాణ చౌరస్తాలో శుక్రవారం నిరసన చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ విద్యాసంవత్సరం ప్రారంభమై 25 రోజులు పూర్తి అవుతున్నా ఇప్పటికీ హాస్టల్ వసతి, పుస్తకాలు, యూనిఫాంలు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించక పోవడం వంటి సమస్యలు పరిష్కరించలేదన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులను అడ్డుకునేందుకు నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. జిల్లా కార్యదర్శి రాజు, నాయకులు సురేష్, శంకర్, నరసింహ, మదు, నరేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

సప్తాహ ప్రవచనం

జడ్చర్ల: స్థానిక రామమందిర్‌లో భాగవత సప్తాహ ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రవచనకర్త బుచ్చిలింగం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దత్తాత్రేయ జాగరణ భక్త బృందం సహకారంతో ఈనెల 9వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

డిగ్రీ గురుకులలో ప్రవేశాలు

దేవరకద్ర రూరల్: బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల ఆధ్వర్యంలో దేవరకద్రలో ఏర్పాటు చేసిన డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని శుక్రవారం ప్రిన్సిపాల్ రఘునాథ్ రెడ్డి కోరారు. బీఏ, బీఎస్సీ, బీకామ్, కోర్సులలో ఆధునిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించే కంప్యూటర్ మిళిత కోర్సులు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9912036678లో సంప్రదించాలని సూచించారు.

నవాబుపేట అభివృద్ధిపై డాక్యుమెంటరీ



నవాబుపేట: మండల అభివృద్ధిపై డాక్యుమెంటరీని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి శుక్రవారం విడుదల చేశారు. మండల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకుల సమక్షంలో హైదరాబాద్‌లో కార్యక్రమం నిర్వహించారు. గతంలో మండలంలో ఉన్న సమస్యలను పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు నర్సింహులు, జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఎంపీపీ అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆధార్‌సెంటర్ ఏర్పాటు

భూత్పూర్: పట్టణంలోని పోస్టాఫీసులో గురువారం ఆధార్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు సబ్ పోస్టు మాస్టర్ రవీందర్ తెలిపారు. పోస్టాఫీసు సమయ వేళల్లో ఉదయం 9:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందని, ఆధార్ కార్డులో సవరణలు చేసుకోవచ్చన్నారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కుంకుమార్చన

అడ్డాకుల: మండలంలోని బలీదుపల్లి శివరామాంజనేయస్వామి ఆలయంలో నాలుగు రోజులుగా తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో వివిధ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. చివరి రోజైన శుక్రవారం ప్రచార పరిషత్ ముఖ్యులు రామాచార్యులు, శ్రీశైలం, ఆంజనేయులు ఆధ్వర్యంలో ఆలయంలో మహిళలతో కుంకుమార్చన నిర్వహించారు. అదేవిధంగా శ్రీమద్రామాయణం, ఉపన్యాసం, భగవద్గీత భజన చేశారు. నిర్వాహకులను గ్రామస్తులు శాలువాలతో సత్కరించి అభినందించారు. శ్రీధర్ యాదవ్, నర్సింహ్మా, నర్సింహ్మారెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువద్దాం



మాట్లాడుతున్న సంపత్‌కుమార్

స్టేషన్ మహబూబ్‌నగర్: అందరం కలిసికట్టుగా పని చేసి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొద్దామని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే ఎస్ఎ.సంపత్‌కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో పట్టణ మాజీ అధ్యక్షుడు అమరేందర్‌రాజు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రాధాఅమర్‌ల నివాసానికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. పరిస్థితులు పరాకాష్టకు చేరినప్పుడూ రాజకీయాల్లో, ప్రజల్లో మార్పు వస్తుందన్నారు. అమర్ ఆయన సోదరులు కాంగ్రెస్ పార్టీలో చేరే విషయాన్ని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. త్వరలో పార్టీలో చేరుతారని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో వివిధ హోదాల్లో ఉన్న వారు పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. రాధా అమర్ పట్టణ అభివృద్ధి కోసం అప్పట్లో పార్టీ మారినట్లు తెలిపారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, నాయకులు రాఘవేందర్‌రాజు పాల్గొన్నారు.

ఆదరణ చూసి తట్టుకోలేక

రాహుల్‌గాంధీకి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి తట్టుకోలేక కేంద్రం కుట్రలు చేస్తున్నదని అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జె.చంద్రశేఖర్ అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం పీఎం నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. విలేకరులతో మాట్లాడుతూ రాహుల్‌గాంధీకి భయపడి కేంద్ర ప్రభుత్వం ఎంపీ సభ్యత్వానికి అనర్హత వేటు వేసిందని ఆరోపించారు. ప్రధాన కార్యదర్శి అబ్దుల్ హక్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు సాయిబాబా, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాములుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారం అడ్డం పెట్టుకుని..

కేంద్ర ప్రభుత్వం అధికారాన్ని అడ్డుపెట్టుకొని రాహుల్‌గాంధీపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నదని టీపీసీసీ ఉపాధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాహుల్‌గాంధీ ఎట్టి పరిస్థితుల్లో పార్లమెంట్‌కి రాకుండా చేయడమే లక్ష్యంగా బీజేపీ పనిచేస్తున్నట్లు విమర్శించారు. రాహుల్‌గాంధీపై కేటీఆర్ మాటలు హాస్యాస్పదంగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో రెండు పార్టీలకు ప్రజలే బుద్ధిచెబుతారని అన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు సంజీవ్ ముదిరాజ్, వినోద్‌కుమార్, అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్, మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు పాల్గొన్నారు.

వాసవీమాతకు పూజలు

దేవరకద్ర: ఆషాడ మాసం మూడో శుక్రవారం సందర్భంగా దేవరకద్రలో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరిదేవిని శాకంబరీదేవీగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా కుంకుమార్చన, లలితా సహస్ర పారాయణం, అమ్మవారి పల్లకీసేవ చేపట్టారు. ఆలయ కమిటీ చైర్మన్ కల్వకన్నయ్య, మహిళా సంఘం అధ్యక్షురాలు మంజుల రాణి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక మున్సిపాలిటీలో ఏఎంసీగా డి.శంకర్‌సింగ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన మార్చి 26న డిప్యూటేషన్‌పై వికారాబాద్ జిల్లా తాండూరు మున్సిపాలిటీకి ఇన్‌చార్జ్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. దీంతో ఏప్రిల్ 3న ఇక్కడి నుంచి రిలీవ్ కాగా, ప్రస్తుతం తిరిగి ఇక్కడికే వచ్చారు.

తలసేమియా స్క్రీనింగ్ ప్రారంభం

మిడ్జిల్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం గర్భిణులలో తల సేమియా కారక జన్యువును గుర్తించే రక్త పరీక్షను హైదరాబాద్‌కు చెందిన సికిల్ సెల్ సొసైటీవారు ప్రారంభించినట్లు వైద్యాధికారిణి మనుప్రియా తెలిపారు. ప్రతి గురువారం ఆరోగ్య కేంద్రంలో 5నెలల లోపు ఉన్న గర్భిణులకు పరీక్షలు నిర్వహిస్తామని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె



మహబూబ్‌నగర్ మండల పరిషత్ కార్యాలయం వద్ద సమ్మెలో పాల్గొన్న కార్మికులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: హన్వాడలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె రెండో రోజుకు చేరింది. శుక్రవారం వీరికి మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మంత్రి నరసింహయ్య, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కార్య నిర్వాహక అధ్యక్షుడు రాఘవేందర్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు వెంకటేష్, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కురుమయ్య మద్దతు తెలిపారు.

మహబూబ్‌నగర్ రూరల్: కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మోహన్ డిమాండ్ చేశారు. సమ్మె శిబిరాన్ని సందర్శించి సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

జడ్చర్ల: సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య నాయకులు సమ్మెకు మద్దతు తెలిపారు.

దేవరకద్ర: ఇఫ్టూ జిల్లా కార్యదర్శి కార్మికులకు మద్దతుగా సమ్మెలో పాల్గొని ప్రసంగించారు.

భూత్పూర్: సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వి.కురుమూర్తి రెండోరోజు సమ్మెలో పాల్గొని మాట్లాడారు. మండల అధ్యక్షుడు మైబు, కార్యదర్శి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల: సమ్మెకు అడ్డాకులలో సర్పంచ్ మంజుల సంఘీభావం ప్రకటించారు. మాజీ ఎంపీటీసీ భీమన్న యాదవ్ పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: గ్రామపంచాయతీ కార్మికులు సమ్మె చేస్తుంటే బెదిరించడం సరికాదని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నర్సిములు అన్నారు.మండల కేంద్రంలో నిర్వహించిన కార్మికుల సమ్మెకు మద్దతుగా వివిధ సంఘాలు, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

గండేడ్: సీఐటీయు జిల్లా కార్యదర్శి కురుమూర్తి, తదితరులు మండలంలోని కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడారు.

చిన్నచింతకుంట: ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి సాంబశివుడు తదితరులు మద్దతు తెలిపారు.

మూడోరోజు తనిఖీలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలో నిషేధిత ప్లాస్టిక్‌కు సంబంధించి మూడోరోజు శుక్రవారం వివిధ దుకాణాలను మున్సిపల్ అధికారులు తనిఖీ చేశారు. తాజాగా హౌసింగ్ బోర్డు, అశోక్ టాకీస్‌చౌరస్తా, క్లాక్‌టవర్, మార్కెట్ రోడ్డు తదితర ప్రాంతాల్లో సుమారు 30 షాపులను పరిశీలించారు. ఈ సందర్భంగా 11మంది యజమానుల నుంచి రూ.తొమ్మిది వేలు జరిమానా వసూలు చేశారు. 56 కిలోల బరువైన 120 మైక్రాన్లలోపు కలిగిన ప్లాస్టిక్, పాలథీన్ కవర్లు, వివిధ గ్లాసులను స్వాధీనపరుచుకున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వరన్న ఆశయాలను కొనసాగిస్తాం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): తెలంగాణ మత్స్య కార్మికుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు తెలుగు ఈశ్వరన్న ఆశయాలను కొనసాగిస్తామని ముదిరాజ్ సంఘం నాయకులు అన్నారు. వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పండుగ సాయన్న సామాజిక సేవ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణముదిరాజ్, మత్స్య కార్మికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గొనెల శ్రీనివాస్, మున్నూర్ రవి, సురేందర్‌బాబు, శ్యాం, వెంకట్రాములు, బాలగోపి పాల్గొన్నారు.

నేడు సమావేశం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): యాదవ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ఈనెల 8న రాజకీయాల్లో యాదవుల వాటా అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు వేదిక జిల్లా అధ్యక్షుడు అంజన్న, ప్రధాన కార్యదర్శి భరత్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

రాచాల రోడ్డును పరిశీలించిన ఈఈ

సాక్షి ఎఫెక్ట్..



పరిశీలిస్తున్న ఈఈ నరేందర్‌రెడ్డి

అడ్డాకుల: మండలంలోని రాచాల బీటీరోడ్డును పంచాయతీరాజ్ శాఖ ఈఈ నరేందర్‌రెడ్డి పరిశీలించారు. పంచాయతీరాజ్ శాఖ నుంచి ఎంఆర్ఆర్ ద్వారా పొన్నకల్ చెరువు కట్ట నుంచి రాచాల వరకు బీటీ రెన్యూవల్ కోసం రూ.2.40కోట్లు నిధులు మంజూరు కావడంతో ఇటీవల కాంట్రాక్టర్ ఆనంద్‌రెడ్డి పనులను చేపట్టారు. పనులను కాంట్రాక్టర్ నాసిరకంగా చేపట్టారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కొత్తగా వేసిన రోడ్డు నెర్రెలు బారడంతో ఈనెల 6న సాక్షి దినపత్రికలో 'నాణ్యత లేని బీటీరోడ్డు' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీరాజ్ శాఖ అధికారులు రోడ్డును పరిశీలించారు. గురువారం పీఆర్ ఏఈ వేణుగోపాల్‌రెడ్డి, శుక్రవారం ఈఈ నరేందర్‌రెడ్డి వచ్చి పొన్నకల్ చెరువు కట్ట నుంచి రాచాల వరకు వేసిన బీటీరోడ్డును పరిశీలించారు. నాలుగు చోట్ల రోడ్డు నాసిరకంగా ఉండటాన్ని పరిశీలించిన ఈఈ చేయించాల్సిన పనులను ఏఈ వేణుగోపాల్‌రెడ్డికి వివరించారు. తక్షణమే పనులను చేయించాలని ఏఈని ఆదేశించారు. పనులు నాణ్యవంతంగా లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

గ్రామకంఠంలో కలపాలి

అడ్డాకుల: పొన్నకల్‌లో ప్లాట్లు, ఇళ్లు ఉన్న స్థలాన్ని గ్రామకంఠంలో కలపాలని కొందరు గ్రామస్తులు శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ నర్ర శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సర్వే నంబర్ 6,7,8,9లో సాదాబైనామా ద్వారా భూ యాజమానులు ప్లాట్లు చేసి విక్రయించారని కొనుగోలుదారులు తెలిపారు. అందులో ఇండ్లు కట్టుకుని జీవిస్తున్నట్లు వివరించారు. ధరణిలో తమపేరు ఉన్నందున అప్పుడు ప్లాట్లు కొనుగోలు చేసిన వారితో ఇప్పుడు భూ యాజమాని డబ్బులు డిమాండ్ చేస్తున్నారని బాధితుల వాపోయారు. సదరు ప్లాట్లల్లో గ్రామ పంచాయతీ ద్వారా నల్లాలు, విద్యుత్ స్తంభాలు, రోడ్ల వసతి కల్పించారని, తాము నివసిస్తున్న ఇళ్ల సర్వే నంబర్లను గ్రామకంఠంలో కలపాలని పేర్కొన్నారు. విజయకుమార్‌రెడ్డి, నాగన్న, కృష్ణయ్య, బురాన్ తదితరులు ఉన్నారు.

భూమిపూజ

మిడ్జిల్: రాణిపేట్‌లో సుమారు రూ. 20లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన గ్రామ పంచాయతి భవన నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. దీంతో ప్రజలకు మేలు కలుగుతుందని ఎంపీపీ సుదర్శన్ అన్నారు. జెడ్పీటీసీ శశిరేఖా, సర్పంచ్ నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ బాధ్యత పంచాయతీలదే

కోయిల్‌కొండ: హరితహారంలో భాగంగా గ్రామాల్లో నాటే మొక్కల సంరక్షణ పంచాయతీ అధికారులు తీసుకోవాలని ఎంపీడీఓ అన్నారు. శుక్రవారం మండలంలోని మల్కాపూర్‌లో మొక్కలు నాటే పనులను పరిశీలించారు. ప్రతి గ్రామపంచాయతీలో ఇచ్చిన గడువులోగా లక్ష్యం చేరుకోవాలన్నారు.

బీఆర్ఎస్ ఇంటింటి సర్వే

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం హన్వాడలోని 5, 6 వార్డుల్లో ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజల నుంచి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రేవతి సత్యం, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యుడు పెంటన్న, వంద ఓట్ల ఇన్‌చార్జ్ కుమ్మరి విజయ్ నాయకులు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవం



మహబూబ్‌నగర్ రూరల్: ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం తెలంగాణ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి కావలి కృష్ణయ్య మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయని అన్నారు. ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ కోసం పుట్టిన ఉద్యమం మానవ హక్కుల దండోరాగా అణగారిన వర్గాల కోసం ముందుండి పోరాటాలు చేసిందని అన్నారు. నాయకులు ఎం.వెంకటస్వామి, పి.బాలయ్య, జె.బాలరాజు, పాపగళ్ల కొండయ్య, ఖాదరయ్య, శ్రీరాములు, ఎంఈఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

జడ్చర్ల: పట్టణంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ జంగయ్య, నాయకులు బాల్‌రాజ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్: మండల కేంద్రంలో అధ్యక్షుడు సురేష్, నాయకులు వెంకటయ్య, రవింద్ర,సురేష్, రవి, జంగయ్య, రాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.28 లక్షలతో అభివృద్ధి పనులు

జడ్చర్ల: ప్రభుత్వం మంజూరు చేసే నిధుల కోసం ఎదురు చూడకుండా సొంత డబ్బును వెచ్చించి ఓ సర్పంచ్ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గొల్లపల్లి పంచాయతీ శివారులోని స్టేషన్ తండాలో సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటు కోసం నిధుల విడుదలలో ఆలస్యం కావడంతో రూ.28 లక్షల సొంత నిధులతో పనులు చేయడానికి సర్పంచ్ రాజేశ్వర్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని చర్యలు తీసుకున్నామని ఈ సందర్భంగా తెలిపారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

మిడ్జిల్: వేములకి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారని మండల అధ్యక్షుడు పాండుయాదవ్ తెలిపారు. ఎమ్మెల్యే కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించినట్లు వివరించారు. పాషా, ఆంజనేయులు, భీంరాజ్, తదితరులు ఉన్నారు.

పొడి, తడిచెత్తపై అవగాహన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక వార్డు నం.11లోని పాత పాలమూరులో, వార్డు నం.45లోని అస్లాంఖాన్ వీధిలో పొడి, తడిచెత్తపై శుక్రవారం ప్రజలకు మున్సిపల్ సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛ ఆటోలకు తడి, పొడి చెత్తను వేరుచేసి బుట్టల్లో ఇవ్వాలన్నారు.

విత్తన శుద్ధిపై ..

గండేడ్: వేరుశనగ విత్తన శుద్ధిపై రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు శుక్రవారం అవగాహన కల్పించారు. అందులో భాగంగానే మండలకేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు పర్యటించారు. కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాలు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: హన్వాడ మండల కేంద్రం లో శుక్రవారం సాయంత్రం జములమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు. వందలాది మహిళలు తమ తలపై బోనాలు పెట్టుకుని ఆలయం వరకు వెళ్లి నైవేద్యం సమర్పించారు.



గండేడ్: గండీడ్ మండలంలోని కప్లాపూర్ గ్రామంలో పోచమ్మ బోనాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నవాబుపేట: కాకర్లపహాడ్‌లో శుక్రవారం బోనాల వేడుక ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ జంగమ్మ, నర్సింహులు, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, మైసమ్మ ఆలయ చైర్మన్ కృష్ణయ్య పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

గండేడ్: కేంద్రంలోని బీజేపీ సర్కారు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకుపోవాలని, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని వెన్నచేడ్ నాయకులు అన్నారు. బీజేపీ ఇంటింటి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రచారం నిర్వహించారు. రవికాంత్‌రెడ్డి, ఆశన్నగౌడ్, బాలన్న, మల్కన్న పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జైలుశిక్ష

మహబూబ్‌నగర్ క్రైం: మద్యం తాగి వాహనం నడిపిన ఓ వ్యక్తికి న్యాయమూర్తి పది రోజుల జైలుశిక్షతో పాటు జరిమానా విధించారు. వన్‌టౌన్ పోలీసులు ఇటీవల చేసిన తనిఖీల్లో మద్యం తాగి వాహనం నడుపుతూ జట్రం బాలప్ప పట్టుబడ్డాడు. శుక్రవారం కోర్టులో హాజరుపరచగా ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి డి. నిర్మల జైలుశిక్ష, రూ.3వేల జరిమానా విధించారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు పోలీసులు బాలప్పను జైలుకు తరలించారు.